క్లుప్తంగా

ఘనంగా ముడుపుల పూజలు



ఆలయంలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: స్థానిక సువర్ణముఖి నది ఒడ్డున గల వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన లక్ష్మీనృసింహస్వామివారికి భక్తులు ఘనంగా ముడుపుల పూజలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు గురువారం కావడంతో వందలాది మంది భక్తులు ఆలయాన్ని వచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి అభిషేకాలు చేసి, తులసీదళాలతో మాలలు వేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సందడి నెలకొంటుందని, భక్తుల రద్దీనిదృష్టిలో ఉంచుకుని ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంల వరకు ముడుపుల పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అల్పాహారం వితరణ చేశారు.

వైద్యసేవ మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎమ్మెల్యే విజయ చంద్రకు వినతి పత్రం అందజేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ మిత్రలు

పార్వతీపురంటౌన్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సేవ మిత్రలు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను వినతిపత్రం అందజేశారు. తమ జీతభత్యాలు పెంచాలని, కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్య మిత్రలు. నిమ్మకాయల రాజ్, కమల్, దొనక చిరంజీవి, పరుశురాం, ఉదయ్ కిరణ్, సింహాచలం, వెంకటరమణ పాల్గొన్నారు.

రంగస్థల నటుడి కుటుంబానికి పరామర్శ



శ్రీరాములునాయుడు(ఫైల్)

బలిజిపేట: మండలంలోని శివరాంపురం గ్రామానికి చెందిన రంగస్థల నటుడు ఆర్.శ్రీరాములునాయుడు మృతి తీరని లోటని గురజాడ విద్యాసంస్థల అధినేత స్వామినాయుడు అన్నారు. ఆయన మృతి పట్ల స్వామినాయుడు గురువారం సంతాపం తెలియజేశారు. నాలుగు దశాబ్దాలుగా రంగస్థల నటుడుగా మంచి పేరుప్రతిష్టలు సంపాదించిన వ్యక్తి అని కొనియాడారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విధుల్లో అలసత్వం వద్దు

పార్వతీపురంటౌన్: ప్రజలకు సేవలు అందించాల్సిన ఉద్యోగులు విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే విజయ్ చంద్ర తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఈ సందర్భంగా పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన క్యాస్ట్, ఇన్‌కం నేటివిటీ తదితర సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతున్నట్లు ఎమ్మెల్యే గుర్తించారు. పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను తక్షణమే పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్యామలాంబ పండుగకు మోగిన దండోరా



సాలూరు: పట్టణంలో కొలువైన శ్రీ శ్యామలాంబ పండగ నిర్వహణకు దండోరా గురువారం మోగింది. వచ్చే ఏడాది మే నెల 18,19,20 తేదీలలో పండగ నిర్వహించనున్నట్లు పెద్దలు ప్రకటించారు.ఈ క్రమంలో శ్యామలాంబ ఆలయ అనువంశిక ధర్మకర్త విక్రమచంద్రసన్యాసిరాజు, పెద్దల ఆధ్వర్యంలో దండోరా వేసి పండగ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రజలను కోరారు. యువరాజు ఇంటి నుంచి ఈ దండోరా ప్రారంభించి అల్లు, జన్ని కుటుంబీకుల ఇళ్లు, అమ్మవారి గద్దె వరకు కొనసాగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన తిరుపతిరావు, నాయకులు,పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కోతలు కోయవద్దు

- దానా తుఫాన్ హెచ్చరికతో వ్యవసాయాధికారుల సూచన
- రైతుల్లో మొదలైన ఆందోళన

సీతానగరం:

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరిచేను పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో 'దానా' తుఫాన్ హెచ్చరికలు రావడం, గురువారం ఈదురు గాలికి చేను పడి పోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో వరియదలు, వరిఉబాలు, తాడు ఉడుపు, మొక్క వేయడం తదితర విధానాలతో రైతులు 16,552 ఎకరాల విస్తీర్ణంలో వ్యయప్రయాసల కోర్చి వరిసాగు చేశారు. గ్రామాల్లో వరిచేను పంట కోతకు సిద్ధంగా ఉన్నందున మంచిరోజు చూసుకుని సుమారు 4 వేల ఎకరాల్లో వరి చేను కోసి ఇళ్లకు చేర్చేందుకు రైతులు కళ్లాలు సిద్ధం చేశారు. అయితే తాజాగా 'దానా' తుఫాన్ హెచ్చరికలు రావడంతో వరిచేను కోసినా ఇళ్లకు ఎలా చేర్చుకోవాలోననే ఆలోచనలో ఉన్న సమయంలో వాతావరణ, వ్యవసాయాధికారులు పిడుగులాంటి సమాచారం ఇవ్వడంతో రైతులు పండిన పంటను చూస్తూ ఏం చేయాలో తోచక తికమక పడుతున్నారు.



గుచ్చిమిలో తుఫాన్ గాలికి పడిపోతున్న వరిచేను పంట



కోతకు సిద్ధంగా ఉన్న వరిచేను మడులలో నీరు మళ్లిస్తున్న దృశ్యం

28 వరకు వరి కోతలు వద్దు



వరిచేను పంట కోతకు సిద్ధంగా ఉన్నా వాతావరణ శాఖ సూచనల మేరకు ఈ నెల 28 వ తేదీ వరకూ వర్షం పడితే ధాన్యం మడుల్లో రాలిపోతాయి. కనుక పంట పండినా చేను కొయ్యవద్దు.వాతావరణం అనుకూలిస్తే ధాన్యం నూర్పు చేయవచ్చు. ధాన్యం కొనుగోలు కూడా జరుగుతుంది. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇప్పటికే గ్రామాల్లో రైతులకు వరిచేలు కోయవద్దని వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులకు సూచనలు అందజేశామని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ చెబుతున్నారు.

గ్రామాల్లో నేలకు పడిన వరిచేను

ఇప్పటికే తుఫాన్ ప్రభావంతో వీస్తున్న ఈదురు గాలికి జోగింపేట, గుచ్చిమి, మరిపివలస, పాపమ్మవలస, తామరఖండి. పీబీపేట, అప్పయ్యపేట, పెదభోగిలి, పెదంకలాం తదితర గ్రామాల్లో ఆశాజనకంగా పంటదిగుబడి రావడానికి బదులుగా ఏపుగా పెరిగిన వరిచేను నేలపడి పోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తెగులు బారిన పడిన వరిచేను పంటను పరిశీలించిన సంబంధిత అధికారులు నివారణకు సూచనలు సలహాలు ఇస్తున్న సమయంలో 'దానా తుఫాన్' హెచ్చరికలు రావడంతో కోయాల్సిన వరిచేను పండించిన రైతులకు పలు సూచనలు సలహాలు ఇస్తున్నా తుఫాన్ రావడంతో చేతికందనున్న పంటకు నష్టం వాటిల్లుతుందని, ఇప్పటికే 1000 ఎకరాల్లో వరిచేను పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి పశుగణన

- వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు నిర్వహణ



పశువులు

బలిజిపేట: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వచ్చే సంవత్సరం ఫిబ్రవరి నెలాఖరు వరకు 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ కార్యక్రమం 2019లో ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో పశుగణన నిర్వహిస్తుంది. ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, గాడిదలు, గుర్రాలు, వంటి అన్ని రకాల మూగ జీవాల లెక్కింపు చేపడుతున్నారు. ఈ గణాంకాలద్వారా పశుసంవర్ధకశాఖ రూపొందించాల్సిన ప్రణాళికలను గుర్తిస్తారు. పాడి రైతుల సంక్షేమానికి ఆయా రాష్ట్రాలు సమగ్ర కార్యాచరణ రూపొంది స్తున్నాయి. 2019లో మండలస్థాయిలో బలిజిపేట మండలంలో 2019లెక్కల ప్రకారం తెల్లవి 20,500, నల్లవి 600, గొర్రెలు, మేకలు 37,000, కోళ్లు 76,000, పందులు 850, వీధికుక్కలు 650గణన చేయబడ్డాయి. ఇవికాక మరికొన్ని మూగ జీవాలు ఉన్నాయి.

పక్కాగా గణాంకాల సేకరణ

పశుగణనలో భాగంగా గ్రామగ్రామాన ప్రతి ఇంటికి వెళ్లి పక్కాగా గణాంకాలు సేకరించేందుకు మండలస్థాయిలో 17మంది ఎన్యూమరేటర్లను నియమించారు. ఈ సర్వేను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. దీనిపై సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చారు. సేకరణ సమయంలో ఇంటింటా తిరిగేటప్పుడు పశువులు ఉన్నవి? లేనివి? ఉంటే ఏ విధంగా వాటిని పెంపకం చేస్తున్నారు? దానికి సంబంధించి ఖర్చు ఎంతవరకు అవుతోంది? పాడి పశువులు ఉన్నాయా? వ్యవసాయానికి పనికివచ్చేవేనా? అనేది గుర్తిస్తారు. పాడి పరిశ్రమకు సంబంధించి అయితే వాటిపై రాబడులు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకుంటారు. పశువులు కాకుండా ఇతరత్రా ఉండే మూగజీవాల వివరాలు సేకరిస్తారు. పక్కాగా సర్వే నిర్వహణ జరుగుతుందని, సర్వే పూర్తయిన తరువాత గతంలో కంటే మూగజీవాలు పెరిగాయా? లేదా అనేది తెలుస్తుందని మండల పశువైద్యాధికారి గణేష్ తెలిపారు.

ఫైలేరియా బాధితులు జాగ్రత్తలు పాటించాలి



బాధితులు జాగ్రత్తలు పాటించే విధానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

బలిజిపేట: ఫైలేరియా బాధితులు తగు జాగ్రత్తలు ఎలా పాటించాలనే దానిపై బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి తగు సూచనలు అందజేశారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెదపెంకి గ్రామంలో ఫైలేరియా మార్బిడిటీ సర్వే గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఉండాలని సూచిం చారు. ఫైలేరియా వల్ల పాడైన శరీర భాగాలను ఏవిధంగా శుభ్రం చేసుకోవాలనే దానిపై వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. వైద్యసలహాలు, సూచనలు అందించారు. ఫైలేరియా మాత్రలు వాడుకోవాలని, ఎవరికైనా కావలసివస్తే విలేజ్ హెల్త్ క్లినిక్‌లో తీసుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి లార్వా నివారణ కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పొగతో అనారోగ్య సమస్యలు

సాలూరు: పట్టణంలో బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న డంపింగ్ యార్డులో చెత్త తగలబెడుతుండడం వల్ల వచ్చే ఆ పొగతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు గురువారం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ విషవాయువుల వల్ల కామాక్షమ్మ ఆలయం, శ్రీనివాస కాలనీ, కార్తీకమానస రెసిడెన్సీ, దుర్గసాగరం తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పార్వతీపురంటౌన్: విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ బెలగాం ఫీడర్ ట్రీ కటింగ్ చేయడం నిమిత్తం పవర్ సప్లై ఉండదన్నారు. గూడ్స్‌షెడ్ రోడ్, సౌందర్య రోడ్డు శత్రుచర్ల రియల్ ఎస్టేట్ రోడ్డు, ఎస్ఎన్‌పీ కాలనీ, రిక్షా పుల్లర్స్ కాలనీ, జనశక్తి కాలనీ, వివేక్‌కాలనీ, చర్చి వీధి వైకేఎం కాలనీ, డీవీఎం స్కూల్ అగ్రహారం, వీధి తదితర కాలనీలకు పవర్ సప్లైలో అంతరాయం కలుగుతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరాజు



పార్వతీపురంటౌన్: మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ ఈ నెల నాలుగో తేదీన బదిలీపై వెళ్లగా ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఏఈ సన్యాసిరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో కార్యాలయం ఉద్యోగుల జీతాలు, బిల్లులు పెట్టేందుకు అవకాశం లేక జాప్యం జరిగింది. దీంతో ఇటీవల బదిలీపై జీవీఎంసీ నుంచి వచ్చిన డీఈ జి.శ్రీనివాసరాజును ఎఫ్ఏసీ కమిషనర్‌గా నియమించినట్లు డీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు శ్రీనివాసరాజు పూర్తిస్థాయి కమిషనర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు టీపీఓగా పి.ప్రమీలరాణి, ఇంజినీరింగ్ విభాగంలో ఏఈగా కె.అప్పారావు బాధ్యతలు చేపట్టారు.

సంపూర్ణ చికిత్సతోనే మలేరియా నివారణ సాధ్యం



గ్రామంలో రక్తపరీక్షలు చేస్తున్న జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ

పాచిపెంట: సంపూర్ణ చికిత్సతోనే మలేరియా నివారణ సాధ్యమని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు పాచిపెంట మండలంలోని గిరిశిఖర మోదుగ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఎంటమాలజి కార్యకలాపాల్లో భాగంగా ప్రతి ఇంటిని పరిశీలించి దోమల స్థావరాలను గుర్తించారు. ప్రజలకు రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖసిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

27న వాకర్స్ ఇంటర్‌నేషనల్ క్లబ్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్‌నేషనల్ క్లబ్ గవర్నర్ జామి నారాయణ స్వామి, చీఫ్ కోఆర్డినేటర్ యిండుపూరు గున్నేశ్వరరావు

పార్వతీపురంటౌన్: ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల వాకర్స్ ఇంటర్‌నేషనల్ క్లబ్ సమావేశం ఈ నెల 27న ఆదివారం నిర్వహిస్తున్నట్లు వాకర్స్ గవర్నర్ జామి నారాయణ స్వామి గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ పార్వతీపురంలోని పశుపతినాథ్ కల్యాణ మంటపంలో విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, వాకర్స్ 102 డిస్ట్రిక్ట్ వాకర్స్ వాకర్స్ ఇంటర్‌నేషనల్ క్లబ్ సమావేశం సమావేశం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో వాకర్స్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షులు, సెక్రటరీ, ట్రెజరర్‌లు పాల్గొంటారన్నారు. 2025సంవత్సరానికి ఎన్నికైన వాకర్స్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ అభిమన్యు నాయక్, మూడు జిల్లాల విశ్రాంతి గవర్నర్లు 102 డిస్ట్రిక్ట్ పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం, వాకర్స్ పెద్దలు, మెంబర్స్ అభిమానులు అందరూ కార్యక్రమంలో పాల్గొననున్నారని చెప్పారు. 2024వ సంవత్సరంలో అన్ని క్లబ్‌లు చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను గుర్తించి తగిన రీతిలో సన్మాన కార్యక్రమాలు, ప్రోత్సాహకాలు ఉంటాయని, ఇంటర్‌నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్, పార్వతీపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్వతీపురం వాకర్స్ హాజరు కావాలని కోరారు.

వేధింపులు ఆపి అభివృద్ధిపై దృష్టి పెట్టండి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి మన్మథరావు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి మన్మథరావు

పార్వతీపురం టౌన్: స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర చిరు ఉద్యోగులపై వేధింపులు ఆపి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మన్మథరావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఈమధ్య చేసిన పర్యటనలో స్కీం వర్కర్లు మున్సిపల్ కార్మికులు. ఫీల్డ్ అసిస్టెంట్లు, కాంట్రాక్ట్ కార్మికులు వీఓఏల పైన చులకన చేసి మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. మున్సిపల్ కార్మికులను ఉద్దేశించి పని సక్రమంగా చేయడం లేదని, వారికి వార్నింగ్ ఇస్తూ మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. కరోనా కష్టకాలంలో, వరదలు వచ్చేటప్పుడు పార్వతీపురంలో కొన్ని కాలనీలు జలమయమైనప్పుడు మున్సిపల్ కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించారన్నారు.

ఇచ్చిన హామీలు మరిచారా?

గతంలో మున్సిపల్ కార్మికులు పోరాటం చేస్తున్నప్పుడు ప్రతిపక్షంలో ఉంటూ కార్మికుల దగ్గరకు వెళ్లి నన్ను గెలిపించండి మీ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన విషయం మరిచారా? అని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన కార్మికులు గతంలో ధర్నా చేసినప్పుడు వారి దగ్గరికి వచ్చి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించండి అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు చెప్పిన వారిని నియమిస్తూ పాతవారిని తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను, వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కేజీబీవీల్లో పనిచేస్తున్న సిబ్బందిపై వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం ప్రజలపై మీకు అభిమానం ఉంటే మూసివేసిన సుగర్ ఫ్యాక్టరీని పున ప్రారంభించి యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గొర్లి వెంకటరమణ, ఐద్వా నాయకురాలు వి.ఇందిర పాల్గొన్నారు.

గోగు ఊరవేతకు మల్టీ కె ఎరువు వేయాలి



జానుమల్లువలసలో మాట్లాడుతున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మండలంలో గోగుపంట పండించే రైతులు నార నాణ్యత పెంపొందించడానికి నార తీయడం వేగవంతం కావడానికి మెలకువలు పాటించాలని ఎంఏఓ ఎస్.అవినాష్ సూచించారు. జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగా గురువారం ఆయన రంగంపేట, జానుమల్లువలస, చినంకలాం గ్రామాల్లో రైతులతో కలిసి గోగుపంటను పరిశీలించారు. అదేవిధంగా గోగు సాగులో ఉండేకష్ట నష్టాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోగునార ధర క్వింటాకు రూ.3,600 వరకూ ఉందని తెలియజేశారు. గోగు ఎక్కువగా మెట్టభూమిలో సాగు చేస్తారు కాబట్టి పంట తీయడానికి ముందుగా మల్టీకే అనే ఎరువు నీటిలో వేసి నిర్ణీత గడువులోగా గోగును ఊరవేయాలని సూచించారు. గోగులు ఊరవేసే ముందు మల్టీ కె ఎరువు వేయడం వల్ల గోగుపై నారని సులభంగా తీయవచ్చని, నారనాణ్యత పెరుగుతుందన్నారు. భవిష్యత్‌లో ఎక్కువ మందిరైతులు మెట్ట భూముల్లో గోగు పంట విస్తీర్ణం పెంచాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిర్లిప్తత విడనాడాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మురళీమోహన్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉద్యోగ,ఉపాధ్యాయ యూటీఎఫ్ స్వర్ణోత్సవ మండల కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది.ఈ సందర్భంగా ఆయన సభ్యుల నుద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం విప్లవాత్మక పోరాటం చేస్తుందన్నారు. అనితరం యూటీఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎస్ శ్రీనివాసరావు, కె.భాస్కరరావుల ఆధ్వర్యంలో ఏకగ్రీంగా జరిగింది. ఈ ఎన్నికలో మండల శాఖ గౌరవ అధ్యక్షుడిగా టి.మధుసూదనరావు, అధ్యక్షుడిగా పల్లి శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా ఎ.పోలినాయుడు, మహిళా సహాధ్యక్షురాలిగా కె లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బొత్స ప్రసాదరావు, కోశాధికారిగా డోకుల వెంకటరమణతో పాటు జిల్లా, మండల కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో పదవీస్వీకార ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయం ద్వారా మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూనే మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన వెంకటాపురం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని సచివాలయాల ఉద్యోగులు నిబంధనల మేరకు సమయపాలన పాటించాలని ఆదేశించామని తెలిపారు. అలాగే ప్రజలకు అందుబాటులో ఉంటూనే మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్యపనులు, తాగునీరు సరఫరా, అసంపూర్తిగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, శ్రీనివాసరావు మాజీ సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహా విజ్ఞాపన దీక్షను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్-ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు

పార్వతీపురంటౌన్: అగ్రిగోల్డ్ బాధితులు ఈనెల 28వ తేదీ సోమవారం విజయవాడలో ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన మహా విజ్ఞాపన దీక్షను జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్-ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు పిలుపునిచ్చారు. ఈమేరకు స్థానిక ఎన్‌జీఓ హోంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితుల అసహజ మరణాలు, ఆత్మహత్యలకు పాల్పడి మృతి చెందినవారు సుమారు 600మందికి చిలుకు ఉన్నారన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అగ్రిగోల్డ్ బాధితులకు అధికారంలోకి వచ్చిన తరువాత రూ.906కోట్లు అందజేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మి బాధితులకు న్యాయం చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు అగ్రిగోల్డ్ బాధితుల గురించి ఎక్కడా ప్రస్తావన తీసుకుని రాలేదని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తాము కూడా ఇంతవరకు వేచిచూసే ధోరణిలో ఉన్నామన్నారు. ఇప్పటికే వందల సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు అనారోగ్యంతో, అసహజ మరణాలతో మృత్యువాత పడ్డారని, ఇంకా మరింత మంది మృత్యువాత పడకుండా కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అగ్రిగోల్డ్ బాధితులతో ఈనెల 28వ తేదీ సోమవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన మహా విజ్ఞాపన దీక్షకు రాష్ట్రంలోని బాధితులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్-ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్వీఎస్ కుమార్, అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి శ్రీనివాసరావు, సాలాపు అనంతరావు పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరా

- మక్కువలో పర్యటించిన వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి



వైద్య సిబ్బందితో సమీక్ష చేస్తున్న వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

మక్కువ: ప్రజారోగ్య సమస్యలను సత్వరమే గుర్తించడంపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. ఈ మేరకు ఆయన మక్కువ పీహెచ్‌సీ, కాశీపట్నం కేజీబీవీని గురువారం సందర్శించారు. పీహెచ్‌సీలో ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనంలో ఇంటికి బయల్దేరుతున్న గర్భిణుల ఆరోగ్య స్థితిని పరిశీలించి, ఆరోగ్య తనిఖీల వివరాల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ప్రతిరోజూ నమోదవుతున్న ఓపీ, ఐపీ వివరాలు పరిశీలించారు. ల్యాబ్ పరికరాల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణుల పట్ల నిరంతరం పర్యవేక్షణ అవసరమని సూచించారు. గ్రామాల్లో ప్రతి వారం నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలని, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్య స్థితి పరిశీలించాలని, పోషకాహారం, ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తిస్తే ఎన్ఆర్సీలో చేర్చాలని సూచించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి కిశోరీ బాలికలు రక్తహీనతకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం కాశీపట్నంలో కేజీబీవీని డాక్టర్ జగన్మోహన్ సందర్శించి ప్రిన్సిపాల్ నాగరత్నం, వైద్య సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.నిఖిల, సీహెచ్ఓ శకుంతల, సూపర్‌వైజర్లు నిర్మల, డీపీ రత్నం, జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.